సాక్షి సిద్దిపేట

బుధవారం। 15। ఫిబ్రవరి। 2023



సిద్దిపేటలో సెంట్రల్ 'నర్సరీ'

సిద్దిపేట పట్టణ శివారులోని మర్పడ్గలో 50 ఎకరాల్లో సెంట్రల్ నర్సరీ ఏర్పాటు చేసేందుకు రూ.5.85 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 8లో..



సీసీ కెమెరాలు తప్పనిసరి 8లో..

ప్రతీ బ్యాంక్ లోపల, ఎదుట సీసీ కెమెరాలు తప్పనిసరిగా బిగించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత బ్యాంక్ అధికారులకు సూచించారు.



అమరుల త్యాగం మరువలేనిది

దేశం కోసం ప్రాణాలను అర్పించిన అమర సైనికుల త్యాగాలు మరిచిపోలేనివని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ అన్నారు. 9లో..

న్యూస్‌రీల్

రేపు గజ్వేల్‌లో జిల్లా స్థాయి చెస్ పోటీలు



గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా క్రీడా కారిణులకు(యువతులకు) జిల్లాస్థాయి చెస్‌పోటీలను నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ నాగేందర్, పీడీ ఎలియాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాట్స్ (తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ) ఆదేశాల మేరకు ఈనెల 16న గజ్వేల్ పట్టణంలోని సేయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి చెస్ పోటీలు జరుగుతాయన్నారు. 18 నుంచి 29 ఏళ్లలోపు వయసు కలిగిన క్రీడాకారిణులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు 9989170936 నంబరులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 17న జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

జిల్లా నాన్ స్పౌజ్ ఉపాధ్యాయుల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా నాన్ స్పౌజ్ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీల్లో జరుగుతున్న నష్టాలు కోర్టు కేసు విషయంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సల్లారం పద్మారెడ్డి, పి. రవీందర్ రెడ్డి, పి. జనార్దన్ రెడ్డి, పి. రామచంద్రారెడ్డి, అనగోని సతీష్‌గౌడ్, ఎస్. భిక్షపతి, కె. మల్లారెడ్డి, వై.వి. సురేష్ కుమార్, ఎం.లింగమూర్తి, సాదత్ అలీ, పి. రూపా రాణిలను ఎన్నుకున్నారు.

మత్స్య కార్మికులకు ఉపాధి కల్పన



వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

నంగునూరు(సిద్దిపేట): మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లేశం అన్నారు. మంగళవారం నర్మేటలోని గద్దలాయ చెరువులో మత్స్య కార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించి సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో చేప పిల్లలను ఉచితంగా అందజేయడంతో పాటు మత్స్య కార్మికులకు వివిధ రకాల సబ్సిడీలు పంపిణీ చేస్తుందన్నారు. దీని ద్వారా ఉపాధి దొరుకుతుందన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి సభ్యత్వం కల్పించేందుకు అధికారులు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అజీద్, ఎంపీటీసీ బాబు, లక్ష్మయ్య, బాలయ్య, నరసింహులు, శ్రీను, కనకయ్య, సురేశ్, బాబు, గిరి, ప్రశాంత్, అశోక్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా'

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్: గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఎలాంటి అవినీతి జరగలేదని, అధిష్టానం నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ. రాజమౌళి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసమ్మతి కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో ఆయన స్పందించారు. మున్సిపాలిటీలో అవినీతి, అక్రమాలు జరిగాయని తనపై దుష్ప్రచారం చేయడం బాధించిందన్నారు. కౌన్సిలర్లను కుటుంబ సభ్యులుగా భావించినట్లు తెలిపారు. తన కుమారుడు ఎన్‌సీ సంతోష్ మున్సిపల్ అంశాల్లో జోక్యం చేసుకుంటున్నాడని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను చేపడుతూ ఉద్యోగాన్ని సైతం వదులుకున్నాడని ఆయన గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఎవరితోనూ గొడవలు పడిన సందర్భాలు లేవని మున్సిపల్ చైర్మన్ స్పష్టం చేశారు. తమకు డబ్బు సంపాదన ప్రధానం కాదని, కులమతాలకు అతీతంగా అందరితో మమేకమయ్యామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

స్వచ్ఛతలో ముందడుగు

- ప్లాస్టిక్ నిర్మూలనకు పంచాయతీల కసరత్తు
- గ్రామ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌ల ఏర్పాటు
- పాలకవర్గ సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ నిషేధం
- జిల్లాలోని 499 జీపీల్లోనూ స్టీల్ బ్యాంక్‌లు



వెల్కటూరు పంచాయతీ కార్యాలయంలోని స్టీల్ బ్యాంక్

సాక్షి, సిద్దిపేట: మొదట పంచాయతీ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను నిర్మూలించి ప్రజలకు ఆదర్శంగా నిలిచి పల్లెల్లోనూ నిర్మూలించాలని ముందుకు సాగుతున్నాయి పాలకవర్గాలు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలతో ఆయా కార్యాలయాల్లోనే స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాలకవర్గ సమావేశాల్లో స్నాక్స్, టీ, వాటర్ తాగేందుకు జగ్‌లు, భోజనాలకు తదితర అవసరాలకు స్టీల్ వస్తువులనే వినియోగిస్తున్నారు. జిల్లాలోని 499 పంచాయతీల్లోనూ ఈ స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు.

- దేశంలోని ప్రతి మనిషి సగటున ఏడాదికి 11 కిలోలకుపైగా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఈ వాడకం 20 కిలోలకు పెరిగే ప్రమాదముందని ఇటీవల హెచ్చరించింది.
- రోజువారీ దినచర్యలో వాడుతున్న అనేక ప్లాస్టిక్ వస్తువులు, ఫ్లెక్సీలు, ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, నీళ్ల సీసాలు, తాళ్లు, కవర్లు, చేతి సంచులు, బస్తాలు, అలంకరణ సామగ్రి మొదలైన వాటిని మనం ఒకేసారి వాడి పడేస్తాం. తక్కువ మైక్రాన్ల మందంతో తయారైన వీటిని మన పరిసరాల్లో వేయడం వల్ల భూమిలో అవి కరిగిపోవడం లేదు. దీంతో వాయు కాలుష్యం, భూగర్భ జలాలు పెరుగక, ఇంకా అనేక విధాలుగా కాలుష్య వ్యర్థాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి.
- రెండేళ్ల నుంచి ప్లాస్టిక్ నిర్మూలనకు కిరాణం షాప్‌లు, టీ స్టాల్, టీఫిన్ సెంటర్ల నిర్వాహకులకు జరిమానాలు విధించినా అక్కడక్కడ వినియోగిస్తూనే ఉన్నారు. దీంతో పంచాయతీ కార్యాలయాల్లో నిర్మూలించిన తర్వాత గ్రామాల్లో కట్టడి చేయాలని పాలకవర్గాలు నిర్ణయించుకున్నాయి.
- జిల్లాలోని 499 పంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో పంచాయతీలో జనాభాకు అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు వ్యయంతో స్టీల్ వస్తువులను కొనుగోలు చేశారు.
- పాలకవర్గాల సమావేశం జరిగితే టీ స్నాక్స్ తెప్పిస్తారు. అప్పుడు సైతం స్టీల్ సామగ్రిని వినియోగించేందుకు పాలకవర్గాలు నడుం బిగించాయి. ఇందులో భాగంగానే స్టీల్ గ్లాస్‌లు, వాటర్ బాటిల్స్, ప్లేట్లను ఏర్పాటు చేస్తున్నారు.
- అలాగే ఇళ్లలో సైతం వివిధ కార్యాలకు ప్లాస్టిక్ ప్లేట్‌లు వినియోగించకుండా స్టీల్ ప్లేట్‌లను వినియోగించాలని సూచిస్తున్నారు.
- త్వరలో పంచాయతీల పరిధిలో ప్లాస్టిక్‌ను వినియోగించిన నిర్వాహకులపై చర్యలు తీసుకునేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నారు.



రామునిపట్లలో స్టీల్ గ్లాసుల్లో వాటర్ తాగుతున్న జెడ్పీచైర్‌పర్సన్ రోజా శర్మ, డీపీఓ దేవికీదేవి (ఫైల్)

గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం



ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తూ తీర్మానించాం. స్టీల్ వస్తువులు వాడటం వల్ల కలిగే లాభాలను సైతం వారికి వివరిస్తున్నాం. పంచాయతీ కార్యాలయంలో ఉపయోగించేందుకు స్టీల్ వస్తువులను కొనుగోలు చేశాం.

–పెద్ది కవిత, కొండాపూర్ సర్పంచ్(మిరుదొడ్డి)

అన్ని పంచాయతీల్లో అందుబాటులో..



ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశాం. జీపీల్లో జరిగే సమావేశాలకు, అన్ని కార్యక్రమాలకు స్టీల్ వస్తువులను వినియోగిస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో ప్రజల్లో మార్పు రావాలని కోరుకుంటున్నాం.

–దేవకీదేవి, డీపీఓ



రింగు రోడ్డు పనుల గురించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

రింగు రోడ్డుతో నయాలుక్

- పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- గజ్వేల్ రింగు రోడ్డును వేగంగా పూర్తి చేయాలి
- కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి కంఠహారంగా నిర్మిస్తున్న రింగు రోడ్డు అందుబాటులోకి వస్తే గజ్వేల్‌కు నయా లుక్ రానున్నదని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తెలిపారు. మంగళవారం రోడ్డు నిర్మాణ పనులను 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఇప్పటికే 22 కిలోమీటర్ల మేర పనులు పూర్తి కాగా కారులో తిరిగి రోడ్డును పూర్తిగా పరిశీలించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఉన్న జంక్షన్ల వద్ద ఏర్పాటు చేయనున్న గ్రీనరీపై పలు సూచనలు చేశారు. అదే విధంగా ఆయా ప్రదేశాల్లో సెంట్రల్ లైటింగ్, కాటిల్ బోర్డు, ఐమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనుల పురోగతిని రోజువారీగా పరిశీలించి తనకు స్టేటస్‌ను తనకు వివరించాలని «గడా» ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డిని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే నాణ్యత విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఈ రామక్రిష్ణ, గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): గ్రామాలు కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే అభివృద్ధి చెందుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చుంచనకోటలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాలకు ఒక్క రూపాయి ఇచ్చింది లేదని, కేంద్ర ప్రభుత్వ నిధులనే దొడ్డిదారిన సొంత ప్రయోజనాలకు వినియోగించుకున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, శ్మశాన వాటిక నిర్మాణాలు కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేస్తున్నారన్న సంగతి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అలాగే జనగామ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతారెడ్డి, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్, బూత్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కమలేష్, పాండు, మహేందర్ రెడ్డి, ఉమారాణి, సురేందర్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెరవేరిన సొంతింటి కల



పట్టాలు అందిస్తున్న జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

- ఆకునూరులో డబుల్ ఇళ్ల గృహప్రవేశాలు
- పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పేదల సొంతింటి కల సీఎం కేసీఆర్ ద్వారానే నెరవేరిందని, ఇళ్లు లేని నిరుపేదలకు గౌరవంగా ఉండేలా డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టి అందించడం గొప్ప కార్యక్రమమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆకునూరు శివారు రుద్రాయపల్లిలో బేడ బుడిగ జంగాలు, గంగిరెద్దుల కుటుంబాలకు చెందిన 36 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించారు. అనంతరం అకునూరులో నిర్మించిన 21 డబుల్ బెడ్ రూం ఇళ్ల పట్టాలను లబ్దిదారులకు అందించి, వారితో గృహ ప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి పక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాల్ని ప్రజలు నమ్మరని తెలంగాణ ప్రజలందరూ సీఎం కేసీఆర్ వెంటే ఉంటారన్నారు. అనంతరం గ్రామ ప్రధాన రహదారి వెంట ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీని సందర్శించిన ఆయన వెనక్కి జరిపి నిర్మిస్తే విద్యార్థులకు వసతిగా ఉంటుందని సూచించారు. అలాగే అనారోగ్యంతో బాధ పడుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగమల్ల కృష్ణమూర్తిని పరామర్శించారు. గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి గ్రామ అభివృద్ధి, పార్టీ చేపట్టే కార్యక్రమాల దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ చీపురు రేఖామల్లేశం, ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, పెడతల యెల్లారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఉల్లెంగల ఏకానందం, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తాంద్ర నవీన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బాలరాజు, నాయకులు మాదవరెడ్డి, రాజు, వేణు, దాసు, అంజయ్య, సదానందం, తహసీల్దార్ ఎస్.కె.ఆరీఫా, ఆర్‌ఐ రాజెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిర్వహణ, రిపేర్‌పై శిక్షణ



సిద్దిపేటమూస్: గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, సిద్దిపేట పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణ నిరుద్యోగ యువకులకు సీసీ కెమెరాల నిర్వహణ, రిపేర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ శ్వేత మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో సీసీ కెమెరాల ప్రాధాన్యత చాలా ఉందన్నారు. ప్రజల భద్రతకు పోలీసు శాఖ తరుపున ఎన్నో కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సీసీ కెమెరాల నిర్వహణ, రిపేర్లపై దీనిపై ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. 13 రోజుల పాటు శిక్షణ అనంతరం అర్హులకు బ్యాంక్ ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు 18 ఏళ్లు పూర్తి చేసుకుని, పదో తరగతి ఉత్తీర్ణత లేదా ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు.

పాడి రంగానికి ప్రభుత్వం పెద్దపీట



మందులను అందజేస్తున్న లక్ష్మారెడ్డి

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాడిరంగానికి పెద్దపీట వేస్తుందని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం బయ్యారంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాడిరైతులను ప్రోత్సహిస్తూ వారు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. విజయ డెయిరీలో పాలుపోసే రైతులకు ముద్ర లోన్ పొందే అవకాశముందన్నారు. ఎదైనా కారణాలతో పశువు మృతి చెందినట్లయితే మరో పశువును ఇన్సూరెన్స్ కింద అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో 150 మంది గోపాలమిత్రలు పాడిరైతులకు అందుబాటులో ఉంటూ తమ సేవలను అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పశువైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ శ్వేత, వీసీవో సాయన్న, జేవీవో తిరుపతయ్య, వీఏ మహేందర్, సిబ్బంది చరణ్, శ్రీకాంత్, గోపాలమిత్రలు నేతి గౌరీశంకర్, శ్రీరాములు, రాజు, రాములు, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కృషి

- త్వరలో దుబ్బాకకు కేసీఆర్
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక పట్టణంలో ప్రభుత్వ ఉన్నత (కేసీఆర్) పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు క్యూర్ కోడ్‌లతో కూడిన డిజిటల్ కాంటేంట్ స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షలకు సంసిద్ధం కావాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఈ మెటీరియల్ ఉందన్నారు. ఎంతగానో ఉపమోగపడే ఈ క్యూఆర్ కోడ్ మెటీరియల్‌ను త్వరలో అన్ని మండలాల్లో పంపిణీ చేస్తున్నామన్నారు. గతేడాది జిల్లాను 10వ తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలుపగా దుబ్బాక కేసీఆర్ స్కూల్లో వంద శాతం ఫలితాలు సాధించారన్నారు. అదే స్ఫూర్తితో అన్ని పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. త్వరలోనే సీఎం కేసీఆర్ దుబ్బాకు వస్తున్నట్లు ఎంపీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. విద్యార్థి దశలో సీఎం కేసీఆర్ చదువుకున్న ఈ పాఠశాలను సందర్శించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, ఎంఈఓ ప్రభుదాస్, పీఎసీఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, తదితరులున్నారు.

బస్తీ దవాఖానాతో సుస్తీకి చెక్

- ప్రజల చెంతకు ప్రభుత్వ వైద్య సేవలు
- సిద్దిపేటలో ఐదు బస్తీ దవాఖానాలు
- నేడు ఇందిరమ్మ కాలనీలో ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు



ఇందిరమ్మ నగర్‌లోని బస్తీ దవాఖానా

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా, కార్పొరేట్ తరహాలో వైద్య సేవలు అందించేలా ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. బస్తీ స్థాయి ప్రజలకు సైతం అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించేందుకు బస్తీ దవాఖానాలను తీసుకొచ్చారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేటలో ఇప్పటివరకు ఐదు బస్తీ దవాఖానాలు మంజూరయ్యాయి. కాగా ఇప్పటికే మూడు చోట్ల ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అలాగే ఇందిరమ్మ కాలనీలో నిర్మించిన బస్తీ దవాఖానను నేడు(బుధవారం) మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్నారు. మరో దవాఖానా టీహెచ్‌ఆర్ నగర్‌లో నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రూ.13 లక్షలతో నిర్మించిన ఇందిరమ్మ కాలనీలోని బస్తీ దవాఖాన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నారు. ఇందులో 59 రకాల పరీక్షలు సైతం ఉచితంగా నిర్వహించనున్నారు. పేద ప్రజల చెంతకు ప్రభుత్వ వైద్య సేవలను అందించే దిశగా అడుగులు వేసేలా బస్తీ దవాఖానాలు ఎంతో ఉపయోగపడనున్నాయి. ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానతో ఇందిరమ్మ కాలనీ, రేణుకానగర్, లింగారెడ్డిపల్లి, బారాహిమామ్, ఇమామ్‌బాద్, నర్సాపూర్ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రి హరీశ్‌రావుకు కతజ్ఞతలు తెలిపారు.



లోపలి గది

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆది, సోమవారాల్లో పటాన్‌చెరు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 34 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికి(33మంది) రూ.2000 జరిమానా, మరొకరికి రూ.3000 జరిమానా విధించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 11 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.24వేల జరిమానా విధించారు.

ముగ్గురు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పరిధిలో వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యమయ్యారు. అయితే డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తిని అరెస్ట్ చేసి, ఆమెను కుటుంబసభ్యులకు అప్పగించారు.

చిప్స్ కొనడానికి వెళ్లి...

పటాన్‌చెరు ఎస్ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక(14) సోమవారం మధ్యాహ్నం తినడానికి చిప్స్ కొంటానని అమ్మమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో కంగారు పడిన ఆమె తన కూతురుకు జరిగిన విషయంచెప్పింది. మంగళవారం ఉదయం వరకూ ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డిగ్రీ విద్యార్థినిని తీసుకెళ్లిన వ్యక్తి అరెస్ట్

ఎస్ఐ రామనాయుడు కథనం ప్రకారం...పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని(17) సోమవారం కాలేజీకని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన కూతురు అదృశ్యమైందని, తండ్రి మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ విద్యార్థిని కుటుంబసభ్యులకు అప్పగించి, తీసుకెళ్లిన వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

స్కూల్‌కని చెప్పి...

టీచర్ అదృశ్యమైన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.



మధులత (ఫైల్)

ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం..రామచంద్రపురం పరిధిలోని నాగులపల్లికి చెందిన మధులత వెలమెలలో ఓ ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తోంది. సోమవారం స్కూల్‌కని ఇంటి నుంచి వెళ్లింది. అయితే స్కూల్‌కు ఆమె రాకపోవడంతో ప్రిన్సిపల్ మధులత భర్త గోపాల్‌కు ఫోన్ చేశాడు. దీంతో గోపాల్ తన భార్యకు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ వచ్చింది. భార్య గురించి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం సాయంత్రం బీడీఎల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సిద్దిపేటలో సెంట్రల్ 'నర్సరీ'

- మర్పడ్గలో 50 ఎకరాల్లో ఏర్పాటు
- హరితనిధి నుంచి రూ.5.85 కోట్లు మంజూరు

సాక్షి, సిద్దిపేట: పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. 2016లో ప్రతిష్టాత్మకంగా తెలంగాణకు 'హరితహారం' కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా పల్లె, పట్టణాలన్నీ హరితమయం అయ్యాయి. పల్లె ప్రకృతి వనం, బృహత్ ప్రకృతి వనం, అర్బన్ పార్కు, అవెన్యూ ప్లాంటేషన్ ఏర్పాటుతో ఎక్కడ చూసినా పచ్చదనం వెల్లివిరుస్తోంది. సిద్దిపేట పట్టణ శివారులోని మార్పడ్గలో ఐదెకరాల విస్తీర్ణంలో తేజోవనం పార్కు ఉంది. ఇక్కడే నర్సరీ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వభూమి కూడా ఉంది. దీంతో 50 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.

- 50 ఎకరాల విస్తీర్ణంల్లో 50 లక్షలకు పైగా మొక్కలు పెంచేందుకు అనువైన స్థలం ఉందని మంత్రి హరీశ్‌రావు చొరవతో అధికారులు నర్సరీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు.
- హరితనిధిలో భాగంగా సిద్దిపేటజిల్లాకు అటవీశాఖ సెంట్రల్ నర్సరీ మంజూరైంది. మూడేళ్లకు గాను రూ5.85 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అందులో 2022-2023కు రూ1.51 కోట్లు, 2023-2024కు రూ1.18కోట్లు, 2024-2025కు రూ 3.14కోట్లు ప్రభుత్వం అందించనుంది



మర్పడ్గలోని తేజోవనం ఇదే..

- తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు పెంచే పద్ధతులను ఈ నర్సరీలో అవలంబించనున్నారు.
- ట్రేలల్లో గింజలు నాటి మొలకెత్తిన తర్వాత బ్యాగుల్లోకి మారుస్తారు. మీటరున్నర నుంచి 3 మీటర్ల ఎత్తు వరకు ఉండే మొక్కలను పెంచేందుకే ఇక్కడ నర్సరీ ఏర్పాటు చేస్తున్నారు.
- గ్రీన్ పాలిహౌస్‌లు, షెడ్లు నిర్మించి పెద్ద మొక్కలతో పాటు వివిధ రకాల మొక్కలు ఇక్కడే పెంచేందుకు ప్రణాళిక రూపొందించారు.

ఇక్కడి నుంచే అరుదైన మొక్కలు సరఫరా



అరుదైన మొక్కలను గతంలో ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించేవాళ్లం. త్వరలో సిద్దిపేటలో అరుదైన మొక్కలు పెంచుతాం. ఇక ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు మొక్కలను సరఫరా చేస్తాం. మంత్రి హరీశ్‌రావు చొరవతో జిల్లాకు అటవీశాఖ సెంట్రల్ నర్సరీ మంజూరైంది. ఏటా 50 లక్షలకు పైగా మొక్కలు పెంచాలన్న లక్ష్యంగా నర్సరీ ఏర్పాటు చేస్తున్నాం. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

–శ్రీనివాస్, డీఎఫ్ఓ

బియ్యం లారీలో మంటలు



శివ్వంపేట వద్ద మంటల్లో కాలిపోతున్న లారీ

జోగిపేట(అందోల్): చౌటకూర్ మండలం శివ్వంపేట శివారులో మంగళవారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో లారీలో ఉన్న రూ.పదిలక్షల విలువ చేసే బియ్యం బూడిదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. బియ్యంలోడ్‌తో ఉన్న లారీ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి నాందేడ్‌కు బయలుదేరింది. 161వ జాతీయ రహదారిపై శివ్వంపేట మీదుగా వెళుతుండగా, లారీ వెనుక భాగంలో ఎడమవైపున ఉన్న టైర్ బాగా వేడెక్కి మంట అంటుకుంది. ఆ మంట లారీ బాడీకి వ్యాప్తించాయి. దీంతో లారీలో ఉన్న 25 టన్నుల బియ్యంలో సగానికిపైగా కాలిబూడిదైంది. ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను ఆర్పేశారు. అయితే సాయంత్రం వరకు లారీకి సంబంధించిన వ్యక్తులెవరూ రాలేదని పుల్కల్ ఎస్ఐ గణేష్ 'సాక్షి'కి తెలిపారు. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం, లారీ దూర ప్రాంతం నుంచి రావడంతో టైర్లు వేడెక్కాయి. టైర్‌కు మంటలు వచ్చిన విషయాన్ని డ్రైవర్ సకాలంలో గుర్తించని కారణంగా భారీగా నష్టం జరిగింది. అయితే లారీ యజమాని వచ్చేవరకు నష్టం వివరాలు చెప్పలేమని ఎస్ఐ తెలిపారు.

రాజగోపురం వద్ద యాచకుడి మృతి



వరదయ్య మృతదేహం

కొముర‌వెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ పరిసరాల్లో తిరిగే యాచకుడు వరదయ్య(64) మంగళవారం రాజగోపురం వద్ద మరణించాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనస్థలికి చేరుకొని హైదరాబాద్‌లో ఉంటున్న మృతుడి కుటుంససభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రాజగోపురం వద్ద మృతి చెందడంతో ఆలయాన్ని మూసివేశారు. సాయంత్రం సంప్రోక్షణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

బ్యాంకుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



ఆర్‌బీఐ పోస్టర్ ఆవిష్కరణలో సీపీ శ్వేత, పోలీసులు, బ్యాంక్ అధికారులు

బ్యాంక్ అధికారుల సమావేశంలో సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: భద్రత దృష్ట్యా ప్రతి బ్యాంకు లోపల, బ్యాంకు ముందు సీసీ కెమెరాలు తప్పనిసరిగా బిగించాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్. శ్వేత బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం కమిషనర్ కార్యాలయంలో సీసీ కెమెరాలు, సైబర్ క్రైమ్స్, ట్రైనింగ్స్‌పై బ్యాంక్ అధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ ఎక్కువ నేరాలు బ్యాంకు పరిసరాల్లోనే జరుగుతున్నందున సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుత కాలంలో జరుగుతున్న సంఘటనల దృష్ట్యా సీసీ కెమెరాల ప్రాధాన్యం, కమిషనరేట్ పరిధిలో జరిగిన దొంగతనాలను సీసీ కెమెరాల సాయంతో చేధించిన విధానాన్ని సీపీ వారికి వివరించారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ నీరజ మాట్లాడుతూ సీసీ కెమెరాలకోసం తమ ఉద్యోగుల నుంచి సామాజిక బాధ్యతగా కొంత మొత్తంలో నిధులు సేకరిస్తామన్నారు. లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యజిత్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరిగినప్పుడు పోలీసులకు కావాల్సిన సమాచారం చెప్పి, బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి వారి ఖాతాల్లో చేరేలా చూస్తామన్నారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రాజలింగం మాట్లాడుతూ నిరుద్యోగ యువకులకు పోలీస్‌శాఖ సమన్వయంతో సీసీటీవీ మెయింటెనెన్స్ అండ్ రిపేర్‌పై 13 రోజుల శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం ఆర్‌బీఐ రూపొందించిన బ్యాంకుకు సంబంధించిన సమాచార పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, గజ్వేల్ ఏసీపీ రమేష్ పాల్గొన్నారు.

ఆ ఇద్దరు ఎక్కడ?

- వివాహితను యువకుడు బైక్‌పై తీసుకెళ్లినట్టు సీసీ ఫుటేజ్ !
- చెరువువద్ద బైక్, ఇద్దరి చెప్పులు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- నార్సింగిలో వీడని మిస్టరీ

రామాయంపేట(మెదక్): నార్సింగిలో ఇద్దరి అదృశ్యం మిస్టరీగా మారింది. మండల కేంద్రానికి చెందిన వివాహిత, మరో యువకుడు ఒకే బైక్‌పై సోమవారం రామాయంపేటలో కలిసి తిరిగినట్టు సీసీ కెమెరాలో రికార్డు అయినట్టు తెలిసింది. అయితే ఆ బైక్ , ఇద్దరి చెప్పులు మంగళవారం ఉదయం నార్సింగి చెరువు వద్ద లభ్యమయ్యాయి. కూతురు కనిపించడం లేదని ఆమె తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదైంది. సదరు యువతికి మూడు నెలల క్రితం వివాహం జరిగింది. శివరాత్రి పండగ నిమిత్తం ఈనెల తొమ్మిదివ తేదీన ఆమెను అత్తగారింటినుంచి నార్సింగి తీసుకొచ్చారు. చెరువు వద్ద బైక్, చెప్పులు లభించడంతో ఇద్దరూ ఆత్మహత్య చేసుకొని ఉంటారని ముందుగా అందరూ అనుమానించారు. విషయం తెలియగానే గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో చెరువు వద్దకు చేరుకున్నారు. పోలీసులు గజ ఈతగాళ్లు, వలలతో చెరువులో గాలించినా ఇద్దరి ఆచూకీ లభించలేదు. అయితే అందరి దృష్టిని మళ్లించడానికే బైక్, చెప్పులు చెరువు వద్ద విడిచి వెళ్లినట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా మిస్టరీగా మారిన ఈకేసును త్వరలోనే చేధిస్తామని నార్సింగి ఎస్ఐ నర్సింలు పేర్కొన్నారు.



చెరువు వద్ద గుమికూడిన జనం



చెరువు వద్ద వదిలి వెళ్లిన బైక్, చెప్పులు

రెగ్జిన్ షాప్‌లో చోరీ

చేర్యాల (సిద్దిపేట): రెగ్జిన్ షాప్‌లో చోరీ జరిగింది. ఈ సంఘటన మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చేర్యాల మండల పరిధిలోని మాసిరెడ్డి పల్లికి చెందిన ఘనపురం ప్రసాద్ పట్టణ కేంద్రంలో ఉంటూ రెగ్జిన్‌షాప్ నిర్వహిస్తున్నాడు రోజువారి లాగానే సోమవారం రాత్రి షాప్‌నకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా షాప్ తాళం పగలగొట్టి ఉంది. దీంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే పోలీసులు సంఘటనస్థలానికి చేరుకొని క్లూస్ టీం సాయంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. లక్ష రూపాయల నగదు, బంగారు, వెండి ఆభరణాలు చోరీ చేశారని బాధితులు వాపోయాడు.

పెట్రోల్ బంక్‌లో దొంగతనం

నారాయణఖేడ్: సిబ్బంది నిద్రిస్తున్న వేళ..పెట్రోల్ కోసం వచ్చినవారు చోరీకి పాల్పడ్డారు. బంక్ నిర్వాహకుడు ప్రభాకర్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం..నారాయణఖేడ్- నిజాంపేట్ జాతీయ రహదారిపై ఖేడ్ శివారులో మహాలక్ష్మి పెట్రోల్‌బంక్ ఉంది. ఇంధనం కోసం కొందరు వచ్చారు. తెల్లవారుజామున సిబ్బంది నిద్రిస్తున్న విషయాన్ని గుర్తించి కార్యాలయ తలుపులు బద్దలు కొట్టి టార్చ్‌లైట్ సహకారంతో మూడు సెల్ ఫోన్లు, నగదు ఉన్న బ్యాగును అపహరించారు. ఉదయం లేచాక సిబ్బంది తలుపులు తొలగించి ఉన్న విషయాన్ని గుర్తించి నిర్వాహకుడికి సమాచారం ఇచ్చారు. చోరీ ఘటన సీసీ పుటేజీలో రికార్డు అయ్యిందని, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ప్రభాకర్ తెలిపారు.



కార్యాలయ తలుపులు తొలగించిన దృశ్యం

మూడిళ్లలో చోరీ

కొముర‌వెల్లి(సిద్దిపేట): ఒకే రోజు మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని గౌరయపల్లిలో సోమవారం రాత్రి జరిగింది.

- గ్రామానికి చెందిన నీల కనకయ్య కొమురవెల్లి జాతరలో హోటల్ నిర్వహించేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చిచూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి 70 తులాల వెండి, 25 గ్రాముల బంగారం చోరీకి గురైంది.
- తాడూరు బాలయ్య ఇంటికి కొడుకు ఇంటికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి 50 తులాల వెండి, రూ.20 వేలనగదు ఎత్తుకెళ్లారు.
- కర్ణాకర్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కూడా ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

సిద్దిపేట జిల్లాలో వేర్వేరు ఘటనల్లో గాయపడిన ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.



జంగం ఎల్లయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి ఏఎస్ఐ రవీందర్ తెలిపిన కథనం ప్రకారం..మోతె గ్రామానికి చెందిన జంగం ఎల్లయ్య (45) మరో ఇద్దరితో కలిసి సోమవారం రాత్రి బైక్‌పై దుబ్బాకకు బయలుదేరాడు. మోతె శివారులోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న లారీ లైట్ల ఫోకస్‌తో ఎల్లయ్య కళ్లకు ఒక్కసారిగా బైర్లు కమ్ముకున్నాయి. దీంతో బైక్ అదుపు తప్పింది. రోడ్డు పక్కనున్న మర్రిచెట్టు ఊడలకు తగిలి ఎల్లయ్యతో పాటు ఆ ఇద్దరూ కూడా కిందపడి గాయాలయ్యాయి. 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిపల్లి సమీపంలో...



కనకరాజు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: రాయపోల్ మండలం వీరానగర్‌కు చెందిన లక్కుమల్ల కనకరాజు (20) భవన నిర్మాణ కార్మికుడిగా, అదే గ్రామానికి చెందిన సిందం చంద్రం కూడా గజ్వేల్‌లో పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి పని ముగిసిన తర్వాత కనకరాజు ద్విచక్ర వాహనంపై వీరానగర్‌కు బయలుదేరగా, చంద్రం సైకిల్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో గజ్వేల్ మండలం గిరిపల్లి సమీపంలో సైకిల్‌పై ముందుగా వెళుతున్న చంద్రంను ఢీకొని కనకరాజు కిందపడిపోయాడు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కనకరాజుకు మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



నరేశ్ (ఫైల్)

మెదక్ రూరల్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన హవేళిఘణాపూర్ మండలం బూరుగుపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన గడ్డం నరేశ్ (28) రాత్రి ఏడు గంటల సమయంలో కరెంట్ సరఫరాలో అంతరాయం వచ్చిందని, విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతు చేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్‌కు గురై మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పరస్పర దాడులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒకరిపై మరొకరు దాడి చేసుకొని పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో అక్బర్ మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కాగా రఫీ అక్కడకు వెళ్లాడు. ఇద్దరూ ఘర్షణ పడ్డారు. రఫీకి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రఫీని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గతంలో రఫీ అక్బర్ ఇంట్లో అద్దెకు ఉండేవాడని పోలీసులు తెలిపారు. జరిగిన ఘటనపై ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రారంభోత్సవం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని కేసీఆర్ డబుల్ బెడ్‌రూం కాలనీలో మహాత్మాజ్యోతిరావుపూలే (ఎంజేపీ) గురుకుల పాఠశాలను మంత్రి హరీశ్‌రావు బుధవారం ప్రారంభించనున్నారు. ఇప్పటికే సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటికే రెండు ఎంజేపీలు అందుబాటులోకి వచ్చాయి.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై ఆయిల్‌ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్, ఏఓ రమణిలు రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ , రైతుబంధు సమితి మండల కన్వీనర్ బాల్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ భాస్కర్, ఏఈఓలు నాగార్జున, సంధ్య, ఉపసర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్ కుటుంబానికి ఠాక్రే పరామర్శ

పటాన్‌చెరు: టీ పీసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింధు శంకర్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, ఆయన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే పరామర్శించారు. శంకర్ కుటుంబం అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడలోని సూర్యోదయ కాలనీలో నివసిస్తోంది. మాణిక్‌రావు ఠాక్రే మంగళవారం రాత్రి శంకర్ ఇంటికి వచ్చారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. చిత్రపటం వద్ద నివాళులు అర్పించి శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఠాక్రే వెంట ఏఐసీసీ కార్యదర్శి బోస్‌రాజ్, నదీమ్ జావీద్, జిల్లా కాంగ్రెస్ నేతలు కాట శ్రీనివాస్‌గౌడ్, గాలి అనిల్‌కుమార్, వడ్డె జైపాల్ తదితరులు ఉన్నారు.



శంకర్ తల్లితో మాట్లాడుతున్న మాణిక్‌రావుఠాక్రే

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

వేర్వేరు చోట్ల ఉమ్మడి జిల్లాకు చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

భార్యకు దూరమై...

కోహీర్(జహీరాబాద్): భార్యకు దూరమై..తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కోహీర్ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని మనియార్‌పల్లికి చెందిన జయరాజ్(34)కు 2013లో మర్పల్లి మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన నవనీతతో వివాహం జరిగింది. పెళ్లి జరిగి తొమిదేళ్లయినా సంతానం లేదు. కుటుంబ కలహాల కారణంగా ఆరు నెలలుగా భార్య పుట్టినింటిలో ఉంటోంది. దీంతో జయరాజ్ భార్యకు దూరమై తాగుడుకు బానిసయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలంపనికి వెళ్లిన తల్లి ఇంటికి వచ్చేసరికి కొడుకు మృతదేహం దూలానికి వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగుడుకు బానిసై...

వర్గల్(గజ్వేల్): మద్యానికి బానిస అయ్యి జీవితంపై విరక్తితో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. గౌరారం ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని వేలూరుకు చెందిన బగ్గి చంద్రయ్య(62)కు ఇద్దరు భార్యలు, కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కరోనా సమయంలో మొదటి భార్య చనిపోయింది. కొడుకు ఇంటినుంచి వెళ్లిపోయి గజ్వేల్‌లో ఉంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసైన చంద్రయ్య తరచు రెండో భార్యతో గొడవపడేవాడు. దీంతో ఆమె కూడా విసిగి వెళ్లిపోయింది. నాటి నుంచి ఇంట్లో చంద్రయ్య ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం తాను చనిపోతానంటూ రెండో కూతురుకు ఫోన్ చేశాడు. ఇంట్లోనే ఫ్యాన్ కొండికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యతో గొడవ పడి..

పటాన్‌చెరు టౌన్: భార్యతో గొడవపడిన ఓ భర్త ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ మొహ్మద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన ప్రశాంత్(27) ఓప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసై తరచు ఇంట్లో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా మద్యం సేవించాక ఇంటికి వచ్చి భార్య, కుటుంబసభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. కుటుంబసభ్యులు తలుపులు తీసి చూసేసరికి సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని కనిపించాడు. గమనించిన వారు వెంటనే ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరులోని ఓ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ భరించలేక..



సంపత్ కుమార్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని చిన్నచింత కుంటకు చెందిన సంపత్‌కుమార్(38) ప్రైవేట్ వ్యాపారుల వద్ద గుమస్తాగా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబపోషణ, పిల్లల చదువులు, ఇతర అవసరాలకు చేసిన అప్పులు పెరిగాయి. వాటిని తీర్చేదారి కనిపించక మంగళవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.